# మిగిలిందేమిటి?

"లతా! నీకీ విషయం తెలుసా?" అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం చేసి సీటు దగ్గరకి వెళ్తుండగా నా వెనకాలే వచ్చి అంది అపర్ణ.

"ఏ విషయం?" బ్యాగ్ టేబుల్ మీద పడేసి, కుర్చీలో కూర్చుంటూ అడిగాను.

"మన రావుగారు లేరూ!" నా టేబుల్‌కి దగ్గరగా మరో కుర్చీ జరుపుకుని కూర్చుంది అపర్ణ.

"ఏ రావుగారూ?... మన అకౌంటెంట్ రావుగారేనా?" అడిగాను.

"ఆ... ఆయనే"

"ఏమైందాయనకి" కొంచెం ఆత్రంగా అడిగాను.

"ఆయనకేం కాలేదు. నిక్షేపంగా ఉన్నారు. వాళ్ళావిడ మన ఆఫీసు కొచ్చింది."

"అదా!" తేలిగ్గా నవ్వి, బ్యాగ్‌లోంచి తాళం చేతులు తీసి టేబుల్ సొరుగు లాగాను.

"అంత తేలిగ్గా అనకు. అసలెందుకొచ్చిందో తెలిస్తే... నువ్విలా అనవు."

"ఏముంది? వాళ్ళాయనతో పనుండి ఉంటుంది"

"నువ్వో మాలోకానివి. వాళ్ళాయనతో పనుంటే ఇంటిదగ్గర మాట్లాడదా! ఆయన మీద మన కమిషనర్‌గార్కి రిపోర్ట్ చేయడానికొచ్చింది."

ఆశ్చర్యంగా చూశాను. "దేనికి?"

అపర్ణ కొంచెం స్వరం తగ్గించి చెప్పింది "రావుగారికి లేటు వయసులో చాలా ఘాటు ప్రేమికురాలు దొరికిందట. ఆవిణ్ణి ఉంచుకొన్నారట."

నా మతి పోయినట్టయింది. రావుగారు చాలా మంచాయన. ఆయనేంటి? ఎవర్నో... నాన్సెన్స్. ఏదో మిస్ అండర్ స్టాండింగ్ కావచ్చు.

అపర్ణ మళ్ళీ చెప్పసాగింది. "సుభద్రాదేవిగారు... అదే రావుగారి భార్య, మన కమిషనర్‌గార్ని కలిసి పిటిషన్ ఇచ్చింది. ఆయన జీతం ఇవ్వడంలేదని, అంతా ఉంచుకున్నావిడకే పెడుతున్నాడనీ... తనకు ఆయన జీతంలో యాభైశాతం ఇప్పించమని."

"మంచివాడు... మంచివాడు... అంటే చంకనెక్కాట్ట. అలా ఉంది వరస. పరాయి ఆడదాన్ని కన్నెత్తి చూడడు. అపర శ్రీరామచంద్రుడు. శాంతమూర్తి. ఎవర్నీ పల్లెత్తుమాట అనడు ధర్మరాజు అంటూ బిరుదులిచ్చేం చూడు అది మనం చేసిన తప్పు. హుఁ... మేకవన్నె పులి. అంటే ఈయనే అనిపిస్తోంది. లేకపోతే ఈ వయసులో ఈయనగారికి ప్రియురాలు కావాల్సి వచ్చిందా? సిగ్గుండక్కర్లే" ఆవేశంగా అంది అపర్ణ.

అపర్ణ మాటలేం నాకు చెవిన పడలేదు. రావుగారు నిజంగా అలాంటి పని చేశారంటే నమ్మలేకపోతున్నాను. ఆయనంత మంచి మనిషి మా ఆఫీసులో మరొకరు లేరు.

ఐదేళ్ళ నుంచీ నేను రావుగారి దగ్గరే పనిచేస్తున్నాను. ఆయన మంచి మనసు, ఉదార స్వభావం, సహనం చాలా తక్కువమందిలో చూడగలం. నాతో పాటు మరో ఇద్దరు కూడా ఆయన అండర్‌లో పనిచేస్తున్నారు. వాళ్ళు పని దొంగలు. అస్తమానం లీవులు పెట్టేస్తుంటారు. అయినా వాళ్ళ పని కూడా ఈయనే చేస్తుంటారు. ఎన్నడూ ఒక మెమో ఇవ్వడంగానీ, మందలించడంగానీ చేయలేదు.

రెండేళ్ళల్లో రిటైర్ అవబోతున్నారు కూడా.

అలాంటి రావుగారు ఇప్పుడు సెకండ్ సెటప్ పెట్టారా? నో! నో!

అపర్ణ చాలాసేపు ఏదో చెప్తూనే వుంది. చాలా పరుష పదాలు వాడి, తిట్టింది రావుగార్ని. "దొంగ మొహం' అంది, 'తేనెపూసిన కత్తి' అంది. ఇలాంటివే పర్యాయ పదాలు వాడుతూ రకరకాలుగా తిట్టి అలసిపోయి తన సీటు దగ్గరికి వెళ్ళింది.

నేను ఆరోజంతా పనిమీద నా మనసు లగ్నం చేయలేకపోయాను.

అపర్ణ మాటలన్నీ నా చెవుల్లో హోరుమంటున్నాయి.

రావుగారి మొహం కళ్ళముందు కదలాడుతూనే వుంది.

వారం రోజులు గడిచాయి. నెమ్మది నెమ్మదిగా మొదలైన రావుగారి సెకండ్ సెటప్ గురించి పుకారు దావానలంలా వ్యాపించింది. అందరూ ఆయన వైపు

దృష్టి కేంద్రీకరించారు. ఆయన గురించి గుసగుసలు కూడా ఎక్కువైనాయి.

కొందరు రహస్యంగా ఆయన్ని తిట్టసాగారు. "ఈ వయసులో ఇదేం బుద్ధి... పిల్లలు పెద్దవాళ్ళై పెళ్ళిళ్ళై సెటిలయ్యారు. మంచి ఉద్యోగాలు చేస్తూ ఎంచక్కా అమెరికాలో ఉన్నారు. మొగుడూ, పెళ్ళాం 'కృష్ణారామా' అనుకుంటూ దర్జాగా బ్రతక్క ఇప్పుడీ కలహాలేమిటి?"

"చాలా మంచివాడులా, మెతగ్గా ఉంటూ ఇదేం పనండీ... అయినా ఇలాంటి పనులు చాటుమాటుగా ఉండాలి కానీ, ఇట్లా నేరుగా ఆఫీసర్లకు కంప్లైంట్ చేయడం ఏమిటి? ఆడది ఇలా వీధిన పడడం బాగాలేదు."

"నిజమే... సంసారం ఇలా రచ్చకీడుస్తారా! అయినా ఆవిడకి డబ్బుకేం లోటని. కొడుకులిద్దరూ ఇంజనీర్లు. పైగా అమెరికాలో ఉన్నారు. వద్దంటే డబ్బు. పైగా రావుగారు మాత్రం తక్కువ సంపాదించాడా? ఎంత జాగ్రత్తగా ఉంటూ ఇల్లు కట్టాడు. పిల్లల్ని వృద్ధిలోకి తీసుకొచ్చాడు. ఇంకా ఏంకావాల్ట. అతనితో అడ్జస్ట్ అవ్వాలిగానీ... ఛీ... ఛీ.. ఇలా బజార్న పడడం బాగాలేదు."

"అయినా ఏనాడూ ఓ కిళ్ళీ కూడా వేసుకోని రావుగారు, ఇలా ఎలా మారి ఉంటారు హఠాత్తుగా. అందుకే అన్నారు "ఎంత వారలైనా కాంత దాసులే" అని.

ఈ విధంగా రకరకాల వ్యాఖ్యానాలతో ఆఫీసంతా గగ్గోలెత్తిపోతోంది.

రావుగారు మాత్రం నిండు కుండలా తొణక్కుండా ఎప్పట్లాగే ఉన్నారు. తన పని తాను చేసుకుపోతున్నారు. నాతో ఆప్యాయంగానే ఉంటున్నారు.

హఠాత్తుగా ఓ ఇరవైరోజుల తరువాత రావుగారు ఆఫీస్‌కి రావడం మానేశారు.

ఫస్టు తారీకు వచ్చింది. ఆరోజు మాకు పేడే.

రావుగారి భార్య సుభద్రగారు వచ్చారు.

నుదుట నయాపైసంత కుంకుమ బొట్టుతో, నిండుగా కొంగు కప్పుకుని ఉన్న సుభద్రగారు ఎంతో గౌరవనీయంగా కన్పించారు. ఆవిణ్ణి చూస్తుంటే ఈవిడలో ఇంత రివల్యూషనరీ థింకింగ్ ఉందా? అనిపించింది.

ఆవిడ ఒంటిమీద నగలు, ఆవిడ కట్టుకున్న ఖరీదైన చీర, కళకళ్ళాడుతున్న ఆవిడ మొహం చూస్తుంటే ఈ ప్రపంచంలో ఈవిడకన్నా సుఖంగా ఉన్న స్త్రీ ఇంకోరు లేరేమో అనిపించింది.

ఆవిడ వెళ్ళిపోయాక స్టాఫ్ అంతా ఆవిడ గురించే మాట్లాడుకోడం మొదలుపెట్టారు.

మనిషి చూస్తే మహాలక్ష్మిలా ఉంది. ఇదేం బుద్ధి. మొగుణ్ణి ఇంతలా హెరాస్ చేసే స్వభావం ఉందా?

“భార్యలందరూ ఇంతేనండి. మొగుడి సంపాదనమీదే కాదు. వాడి ఇష్టాయిష్టాల మీద, వ్యక్తిత్వం మీద కూడా పెత్తనం చెలాయిస్తుంటారు. కనీసం తల్లికి, చెల్లికి కూడా పైసా పెట్టనివ్వరు.”

“నిజమే మా కజిన్ ఒకడికి పెళ్ళయిన రెండు నెలల్లోనే జీతం మొత్తం తనకివ్వమని ఆర్డర్ పాస్ చేసిందట వాడి భార్య.”

“హుఁ... డి.ఎ. అరియర్స్ వస్తే మా తమ్ముడి భార్య ఆ డబ్బు తీసికెళ్ళి నగలు కొనుక్కుంది. కనీసం వాడికేదన్నా అవసరం ఉందేమో ఆ డబ్బుతో అని కూడా అడగలా”

“మా ఆవిడ కూడా అంతేనండీ బాబూ, నా బట్టల గురించి, నా అవసరాల గురించి ఆలోచించదు. నా డబ్బంతా తీసుకెళ్ళి ఇన్‌స్టాల్‌మెంట్స్ కడ్తుంది. అన్నీ చీరలే.”

ఇలా మా మేల్ స్టాఫ్ మధ్య సాగుతున్న సంభాషణ చాలాసేపు ఓ చర్చగా సాగిపోయింది.

కొంతకాలం గడిచింది.

రావుగారు లాంగ్ లీవ్ పెట్టారు. రెండో ఆవిడ దగ్గరే ఉంటున్నారట. సుభద్రాదేవిగారు ఇంకో పిటిషన్ పెట్టింది. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌లో యాభై శాతం తనకి ఇప్పించాల్సిందని.

కోర్టు ఆర్డర్ లేకుండా మా కమిషనర్ గారు అలా ఎలా యాభైశాతం జీతం ఇస్తున్నారో ఆవిడకి అనుకున్నాను.

రావుగారు తల్చుకుంటే కమిషనర్‌గార్కి వ్యతిరేకంగా కోర్టుకెళ్ళవచ్చు. కానీ అలా వెళ్ళకపోవడం ఆయన సంస్కారం.

ఓరోజు రావుగారు నాకు మార్కెట్లో కనిపించారు.

ప్రక్కనే ఓ నడివయసు స్త్రీ ఉంది. ఆవిడ చాలా హుందాగా ఉంది. మొహం ప్రశాంతంగా, చిరునవ్వులు చిందిస్తూ ఉంది. నన్ను చూడగానే రావుగారు చాలా ఆప్యాయంగా పలకరించారు. ప్రక్కన ఉన్న ఆవిణ్ణి పరిచయం చేశారు.

"ఈమె రమాదేవి. నా చిన్ననాటి స్నేహితురాలు."

నేను అప్రయత్నంగా నమస్కరించాను.

ఆవిడ చిరునవ్వుతో పలకరించింది. "నీ పేరేంటమ్మా?" అంటూ.

"ఈ అమ్మాయి లత. నా అసిస్టెంట్. చాలా మంచమ్మాయి" చెప్పారు రావుగారు.

"అలాగా! మీరు మాట్లాడుతుండండి. నేనలా ముందుకెళ్ళి వెజిటబుల్స్ కొనుక్కొస్తాను." అంటూ ఆవిడ చకచకా ముందుకి నడిచింది.

రావుగారు "ఎలా ఉన్నారమ్మా లతా! అందరూ నన్నసహ్యించుకుంటున్నారా?" అడిగారు.

"అబ్బే అదేం లేదండి. ఎందుకు లాంగ్ లీవ్ పెట్టారు? ఆరోగ్యం బాగా లేదా?" అడిగాను.

ఆయన నెమ్మదిగా నిట్టూర్చారు.

"లతా నాకు తెలుసు నా గురించి ఆఫీసులో అందరూ ఏమనుకుంటున్నారో! దానికి నేను బాధపడటంలేదు లతా! జీవితంలో కొందరికి ఎన్నో ఇస్తాడు దేవుడు. కానీ కొన్ని ఇవ్వడు. కొందరికి అన్నీ ఇస్తాడు. కానీ ఏమీ ఇవ్వడు. ఇదోరకం వేదాంతం. కంగారుపడకు. నాకు మంచి ఉద్యోగం, మంచి భార్య, ముత్యాల్లాంటి పిల్లలు, ప్రశాంతమైన జీవితం ఇచ్చాడు. కానీ రమని దూరం చేశాడు. తనకీ అంతే, కావాల్సినంత డబ్బు, మంచి ఉద్యోగం, కారు, ఫోను అన్నీ ఇచ్చాడు, కానీ తన అనే ఆత్మీయుల్ని ఇవ్వలేదు. రమాదేవి నా చిన్ననాటి స్నేహితురాలు. దాదాపు పి.యు.సి. దాకా కలిసి చదువుకున్నాం. తరువాత వాళ్ళ నాన్నగార్కి ట్రాన్స్‌ఫర్ అవడంతో రమాదేవి చాలాదూరం వెళ్ళింది. ఆమె వెళ్ళాక కానీ తెలీలేదు ఆమె అంటే నాకిష్టమని. ఆమె లేనిలోటు తెలిశాక ఏం చేయలేకపోయాను. తరవాత నేను జీవితంలో సెటిలయ్యాను. తనేం చేస్తోందో? ఎక్కడుందో తెలీలేదు."

"ఇప్పుడెలా కలిశారు?" కుతూహలంగా అడిగాను.

"రమ నాకన్నా ఎక్కువ చదువుకుని కాంపిటీటివ్ ఎగ్జామ్స్ రాసి మంచి ఉద్యోగం సంపాదించింది. ఆంధ్రాబ్యాంక్ మేనేజర్‌గా ప్రమోట్ అయి ఈమధ్యే అంటే ఏడాది క్రితం హైదరాబాద్‌కి వచ్చింది. పాపం వంటరిది. వాళ్ళ నాన్నగారు హఠాత్తుగా పోవడంతో బాధ్యతలు మీదపడి తమ్ముళ్ళను, చెల్లెళ్ళనూ వృద్ధిలోకి

తీసుకువచ్చే బాధ్యత తీసుకుంది. ఫలితంగా ఆమె ఒంటరిగా మిగిలిపోయింది. ఈ ఊరు రాగానే నా అడ్రస్సు వెతుక్కుంటూ కలిసింది.

ఇంతకాలానికి కలిసిన నా ఆత్మీయురాలితో రోజూ ఓ గంట కూర్చుని మాట్లాడటం తప్పా! రమాదేవి మా ఇంటికి వచ్చిన దగ్గర్నించి మా ఆవిడ ఇంటిని ఓ నరకంలా చేసింది. ప్రతిక్షణం నన్ను మానసికంగా చిత్రవధ చేసింది. దానిక్కారణం– ఇంతకాలం నేను నా అస్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని అటకెక్కించి, భార్యాపిల్లల కోసం బ్రతికాను కదా! ఓ స్నేహితుడి దగ్గరికి కానీ, ఓ క్లబ్బుకి కానీ, కనీసం సుభద్రకి తెలీకుండా సినిమాకి కానీ వెళ్ళనివాణ్ణి, హఠాత్తుగా రమాదేవిలాంటి స్త్రీతో కబుర్లు చెప్పడం, ఆమె నా ఆత్మీయురాలనడం నా భార్య జీర్ణించుకో లేక పోయింది. ప్రతిరోజూ ఆమెని కలవకూడదని శాసించడం, ఆమె దగ్గరికి వెళ్ళితే గొడవ చేయడం, నిజం చెప్పనా? ఇన్ని సంవత్సరాల నా జీవితం గడిచి పోయాక నేను కోల్పోయిందేమిటో నాకర్థమైంది."

నేను ఆసక్తిగా చూశాను.

"ఆడదానికైనా, మగాడికైనా వ్యక్తి స్వేచ్ఛ ఎంత అవసరమో ఈమధ్యే తెలిసింది. ఓ ఆదర్శప్రాయుడైన భర్తగా నా భార్యనీ, పిల్లల్ని ఎంతో అపురూపంగా చూసుకున్నాను. ఇల్లు, నగలు, బ్యాంక్ బాలెన్స్ ఇచ్చాను. నా పిల్లల్ని ప్రయోజకులను చేశాను. నా ఇష్టాలు, వాళ్ళ ఇష్టాలుగా, నా బ్రతుకు వాళ్ళ కోసమేనన్నట్లుగా బ్రతికాను. అందుకే వాళ్ళ దృష్టిలో మంచివాణ్ణి అయ్యాను. నువ్వు చెప్పు లతా! మనిషికి ఆత్మీయులుండ కూడదా?"

నేనేం మాట్లాడలేదు. మౌనంగా ఆయన చెప్పేది వింటున్నాను. ఎంత సౌమ్యంగా, మితభాషిగా ఉండే రావుగారు, ఈరోజు ఎక్కువగా మాట్లాడుతున్నారు. ఆయన గుండెల్లో అణిగివున్న ఎన్నో భావాలు ఈరోజు రెక్కలు వచ్చి ఎగురుతున్నట్టుగా ఎంతో భావోద్రేకంతో మాట్లాడుతున్నారు.

"లతా! నేను తాగుబోతుని కాదు. తిరుగుబోతుని కాదు. శాడిస్టును కాదు. మీరంతా గొంతు చించుకుని ఉపన్యాసాల ద్వారా పొందాలనుకునే స్వేచ్ఛని నేను నా భార్యకేనాడో ఇచ్చాను. ఆమె ఇష్టాలకు నేనెన్నడూ అడ్డు తగల్లేదు. ఎప్పుడూ నేనామెని నాకిది కావాలని ఏదీ అడగలేదు. అసలు నాకేం కావాలో నాకూ తెలీలేదు. కానీ రమాదేవి తిరిగి నా జీవితంలోకి వచ్చాక తెలిసింది. నేనేం పోగొట్టుకున్నానో! తిరిగి ఏం పొందానో! అదే ఆత్మీయత. బాధ్యతలకూ, బంధాలకూ, డబ్బుతో కూడిన లావాదేవీలకూ అతీతమైన ఓ స్నేహం. నేనా స్నేహం,

ఆత్మీయత పొందాలంటే నాకు స్వేచ్ఛ కావాలి. ఇంతకాలం నేను బ్రతికాను. నా స్వేచ్ఛని, స్వతంత్రతని తాకట్టుపెట్టి బతికాను. నువ్వే చెప్పు? ఈ వయసులో నాకు రమాదేవితో శారీరక సంబంధం ముఖ్యమా! పాపం! ఓరోజు తనకి గుండెనొప్పి వచ్చింది. ఆ సమయంలో నేను వాళ్ళింట్లోనే ఉన్నాను. అదృష్టవశాత్తూ అది ఎటాక్ కాదు. కానీ వంటరిగా ఉంది. పైగా హఠాత్తుగా అనారోగ్యం వచ్చింది. ఎలా వదిలేసి రాగలను. ఆ రాత్రి తనకి తోడుగా అక్కడే ఉండి, మర్నాడు ఉదయం ఇంటికి వెళ్ళాను. ఇల్లోక రణరంగమైంది. సుభద్ర ఏడుపు, శోకాలు, శాపాలు, పిల్లలిద్దరికి ఫోన్ చేసి, నేను రమాదేవిని ఛీ... ఛీ... ఎలా చెప్పను, చిన్నపిల్లవి. అంతే ఆరోజు వచ్చి కమీషనర్‌గార్ని కలిసింది. నా పరువు తీసింది. నన్నో తిరుగుబోతుని చేసింది" బాధగా అన్నారాయన. కర్చీఫ్‌తో కళ్ళొత్తుకుంటూ.

నాకు ఆయన్ని అలా చూస్తుంటే చాలా జాలేసింది.

"లతా! ప్రతి మనిషికీ తనదంటూ ఓ ప్రైవేట్ లైఫ్ సపరేట్‌గా ఉండాలి. అది మగాడికి, ఆడవాళ్ళతోనూ, ఆడవాళ్ళకి మగాళ్ళతోనూ అని కాదు. కొందరు ఫ్రెండ్స్ ఇళ్ళకి వెళతారు. కొందరు క్లబ్బులకెళతారు. కొందరింకేదో చేస్తారు. దానిక్కారణం తెలుసా! స్వేచ్ఛని కోల్పోకుండా ఉండడం కోసం. ఆ స్వేచ్ఛ అనేది లేకపోయాక మనిషి బ్రతకడం అనవసరం అనిపిస్తోంది. నేనిప్పుడు ఆ స్వేచ్ఛను కోల్పోయాను. అందుకే ఆ స్వేచ్ఛ తిరిగి పొందడం కోసం నా వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం నేను కొంచెం మొండిగా మారాను. నాకు తెలుసు. నాలోని ఈ మార్పు నన్నెందరికో శత్రువుని చేస్తుందని. అయినా నేను మారదల్చుకోలేదు. ఇదంతా రమ మీద ప్రేమతోటో, మోహంతోటో కాదు. నా వ్యక్తిత్వాన్ని కాపాడుకోడానికి, నేను కోల్పోయిన స్వేచ్ఛని తిరిగి పొందడానికి."

ఇదంతా చెప్పి దీర్ఘంగా నిట్టూర్చాడాయన.

నాకు చాలా జాలేసింది. పాపం! రావుగారు అనిపించింది.

ఎందుకో కొందరు ఆడవాళ్ళు చాలా మూర్ఖంగా ప్రవర్తిస్తారు. భర్త చేతుల్లోంచి జారిపోతాడేమోనని, గుప్పెట్లో బిగించడానికి ప్రయత్నిస్తారు. కానీ అలా ఎంతకాలం అధికారంతో మనిషిని బంధించగలరు? అనురాగంతో మనసు గెల్చుకోవాలేగానీ, అధికారంతో ఆ మనసు మీద ఆధిపత్యం చెలాయించాలనుకోవడం దారుణం కదా!

"మీరు జీతం ఇంట్లో ఇవ్వడం లేదా?" అడిగాను.

"ఎందుకివ్వనమ్మా! రమకి బోలెడాస్తి ఉంది. నాకన్నా మంచి హోదాలో

ఉంది. తనకి నా డబ్బు ఎందుకు? ఇంకా తనే ఏదో సాయం చేయడానికి ఆరాటపడుతుంది కానీ నాకూ తన సాయం అవసరంలేదు. ఇదంతా నా భార్య నా మీద చేస్తున్న కక్ష సాధింపు చర్య. నన్ను అడిగితే యాభై శాతం ఏం ఖర్మ మొత్తం జీతం ఇచ్చేవాణ్ణి. నాకేం కావాలి? సంవత్సరానికి రెండు జతల బట్టలు. ఓ గుప్పెడు మెతుకులు. ఈ రెండూ రమాదేవి ఇవ్వగలదు."

సుభద్రాదేవిగారు అలా చేసి ఉండాల్సింది కాదేమో అనిపించింది.

ఆవిడ కోసం రావుగారు ఎన్ని త్యాగాలు చేయకపోతే ఆవిడకీనాడు ఇంత కంఫర్టబుల్ లైఫ్ ఉంది? ఆయన సంతోషాలు, అభిరుచులు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఆవిడ కోసం ఆయన త్యాగం చేయగాలేనిది ఆయన కోరుకున్న ఒక్క స్నేహాన్ని ఆహ్వానించ లేకపోయింది. భార్యాభర్తలంటే ఒకరి తప్పులు మరొకరు క్షమించు కుంటూ, ఒకరి భావాల్ని మరొకరు గౌరవించుకుంటూ ఒకర్నొకరు అర్థం చేసుకుని అన్యోన్యంగా జీవించడం అంటారే, మరి సుభద్రాదేవిగారెందుకు తన భర్తని అర్థం చేసుకోలేకపోయింది.

"లతా! పెద్దవాణ్ణి ఒక్కమాట చెప్తున్నాను విను. పెళ్ళి కావాల్సిన దానివి. భర్త అంటే, గారడీవాడి చేతిలో మంత్రదండంలాగా, నీ చేతిలో నువ్వు తిప్పినట్లల్లా తిరుగుతూ ఉండాలని కోరుకోకు. మన దేశం వివాహ వ్యవస్థని ఎంతో గౌరవి స్తోంది కాబట్టి స్త్రీలకు ఎన్నో హక్కులు కల్పించింది చట్టపరంగా. అలాగని భార్యాభర్తల బంధాన్ని చట్టాలూ, శాసనాలూ, ఇండియన్ పీనల్‌కోడ్‌లతో కాకుండా, ప్రేమానురాగాలతో, పరస్పర నమ్మకాలతో, అవగాహనతో నిలబెట్టుకోడానికి ప్రయత్నించు. మరి నే వస్తాను. రమ వస్తోంది" అన్నారు రావుగారు నా దగ్గర సెలవు తీసుకుంటూ.

ఆయన వెళ్తున్న వైపు చూసి గాఢంగా నిట్టూర్చాను.

కొన్ని రోజులు గడిచాయి. ఆయన రిటైర్మెంట్ ఇంకా రెండు నెలలుందనగా రావుగారు జాయిన్ అయ్యారు.

ఇప్పుడు మా ఆఫీసులో రావుగారి విషయం బాగా పాతబడిపోయింది. ఆయనతో అందరూ మామూలుగానే ఉంటున్నారు. ఆయనే బాగా మారిపోయారు. పూర్వంకన్నా ఉదాసీనంగా మారారు.

ఓరోజు సుభద్రాదేవిగారు నా టేబుల్ దగ్గరికి వచ్చి...

"ఆయన అకౌంట్స్ సెటిల్ చేసేది నువ్వేనా?" అని అడిగింది.

"మా సెక్షన్‌లోనే కానీ నేను కాదు" అన్నాను.

"చూడు ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ, వెల్‌ఫేర్ ఫండ్, ఎల్.ఐ.సి., లీవ్ ఎన్‌కాష్‌మెంట్... ఇలా చాలా డబ్బు రావాలిగదా ఆయనకి. అందులో కూడా నాకు యాభై శాతం ఇవ్వాలని చెప్పాను మీ కమిషనర్‌గార్కి, ఏం నిర్ణయించారు?" అని అడిగింది.

నాకెందుకో అసహ్యం వేసింది ఆవిణ్ణి చూస్తే. ఎంత జాగ్రత్తగా లెక్కలు వేసుకుంది. ఈవిడ భర్త ద్వారా తనకొచ్చే లాభాలలో భాగం కోరడం చాలా గొప్ప అనుబంధం. ఇంకా నయం ఆయన పోతే వచ్చే లాభాలను బేరీజు వేసుకోలేదు.

"తెలీదండి" అన్నాను ముభావంగా.

"తెలీకపోవడం ఏవిటి? వారం రోజుల్లో ఆయన రిటైర్ అవుతుంటే ఇంకా తెలీదా?" సీరియస్‌గా అన్నది.

ఆవిడ మళ్ళీ అన్నది. "చూడమ్మాయి, నీకింకా పెళ్ళికాలేదు కాబట్టి నా బాధ నీకర్థంకాదు. పిల్లలు పెద్దవాళ్ళై ఎవరిదారిన వాళ్ళు బ్రతుకుతున్నారా? ఈయన రిటైర్ అయ్యాక మాకు మేమేనా కాలక్షేపం– ఇప్పుడు ఈ వయసులో కృష్ణా, రామా అనుకుంటూ ఒకరికొకరు తోడుగా ఉండాల్సిన వయసులో దాన్నెవత్తినో ఉంచుకోడం బాగుందా? ఏ వయసులో నాకు ఆయన రక్షణ, తోడు కావాలో... ఆ వయసులో స్నేహితురాలంటూ దానితో గంటల తరబడి కూర్చోడమా... నా కడుపు మండదూ! అందుకే ఆయనకి బుద్ధి రావడం కోసమే నేనిలా చేస్తున్నాను. అంతేగానీ నాకు డబ్బు లేకనా? నా పిల్లలు నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటారు. ఇల్లుంది. మా అబ్బాయి కారు కొనిస్తానన్నాడు. ఇంట్లో నౌకర్లున్నారు, నాకేం కావాలి?" కొంచెం దర్పంగా చెప్తున్న ఆమె స్వరంలో ఒకింత అహం కూడా తొంగి చూసింది.

నా ఇల్లు... నా పిల్లలు... ఈ రెండు పదాలు ఆవిడ నోటి నుంచి వింటోంటే చాలా వెగటుగా అనిపించాయి.

రావుగారు ఎంతో కష్టపడీ, చాలా ఎకనామికల్‌గా జీవించి, డబ్బు కూడబెట్టి ఇల్లు కట్టించారు. ఆయన హౌస్ బిల్డింగ్ అడ్వాన్స్ రికవరీ ఇటీవలే పూర్తయింది. పిల్లల్ని వృద్ధిలోకి తీసుకురావడంలో కూడా ఆయన కృషి కనిపిస్తూ ఉంటుంది. అయితే ఆయనకి ఈ రెండింటిలోనూ ఏమీ సంబంధం లేనట్టు ఆవిడ 'నాది' అన్న స్వార్థపూరిత ప్రయోజనం ఆశించడం అంత మంచిది కాదనిపించింది.

రావుగారు ఇవన్నీ అమర్చడం, ఆయన బాధ్యతగా... అనుభవించడం

తన హక్కుగా భావించే ఓ సగటు స్త్రీ సుభద్రాదేవి.

ఆరోజే రావుగారు రిటైర్ అయ్యేది.

ఆ సాయంత్రం ఫేర్‌వెల్ పార్టీ ఏర్పాటుచేశారు.

పార్టీకి సుభద్రాదేవిగారు రాలేదు. రమాదేవిగారు వచ్చారు.

తన స్నేహితురాలిగా పరిచయం చేశారు రావుగారు. కమిషనర్‌గారు ఆవిణ్ణి చాలా మర్యాదపూర్వకంగా రిసీవ్ చేసుకున్నారు.

కమిషనర్‌గారు, జి.ఎం.గారు, ఇతర ఆఫీసర్లు రావుగారి నిజాయితీని, మేధస్సుని ఎంతో శ్లాఘించారు. కొందరు స్టాఫ్ కూడా ఆయన మంచితనాన్ని పొగిడారు. రమాదేవిగార్ని ముఖ్యఅతిథిగా భావించి రెండు ముక్కలు మాట్లాడ మన్నారు. రావుగారితో తనకున్న అనుబంధం గురించి, ఆయన మంచితనం గురించీ ఎంతో హుందాగా వివరించారు.

పూలదండలతో సత్కరించారు ఇద్దరినీ.

కమిషనర్‌గారు డ్రైవర్ని పిలిచి, రావుగార్ని ఇంటి దగ్గర దింపి రమ్మని చెప్పారు.

డ్రైవర్ కొంచెం సందేహంగా చూశాడు. ఈమధ్య రావుగారు ఇంటిదగ్గర ఉండడం లేదని అందరికీ తెలుసు.

రావుగారు డ్రైవర్ సందేహాన్ని గమనించి, చిరునవ్వుతో అన్నారు.

"రమాదేవిగారింటి దగ్గర దింపు నన్ను."

పూలదండలు ఒళ్ళో పెట్టుకుని, మెమొంటోలు చేతుల్లో పట్టుకుని, పక్క పక్కనే కూర్చున్న వాళ్ళిద్దరూ నూతన వధూవరుల్లా అన్పించారు. రిటైర్‌మెంట్ తరువాత కొత్త జీవితం ప్రారంభం అవుతుందంటారు. ఆ కొత్త జీవితం రావుగార్కి, రమాదేవిగారితో ప్రారంభం అవుతుందా? మరి సుభద్రాదేవిగారో!

ఆవిడకి రావుగారి ఆస్తిలో, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌లో ఫిఫ్టీ పర్సెంట్ మిగిలిందన్న మాట. వైవాహిక జీవితాలు విచ్ఛిన్నం అవడానికి కేవలం మగవాళ్ళ అహంకారమే కాదు, ఆడవాళ్ళ స్వార్థం కూడా కారణం అనిపించింది.

***

*(ఆంధ్రభూమి దినపత్రిక)*